క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



హన్మకొండ కల్చరల్ : రాష్ట్ర దేవాదాయ మంత్రి కొండా సురేఖను రుద్రేశ్వరస్వామి వేయి స్తంభాల దేవాలయం ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ బుధవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకు ఈ నెల 26వ తేదీన జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉపేంద్రశర్మ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, జాగరణలో ఉన్న భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా మంత్రి స్పందిస్తూ తగిన ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చారు.

రూ.50వేల ఆర్థికసాయం



వరంగల్ చౌరస్తా : నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన వేముల సంతోష్ ఇటీవల మృతిచెందారు. కాగా బుధవారం వరంగల్ ఆర్ఎన్టీ రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో కుటుంబ భద్రత పథకం ద్వారా సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు రూ.50వేల నగదును సంతోష్ భార్య ప్రవీణకు అందజేశారు.

చేయూత



హసన్‌పర్తి : ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఓ విద్యార్థి కుటుంబానికి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు చేయూతనిచ్చారు. 65వ డివిజన్ చింతగట్టు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న షేక్ జహిరాబీ తల్లి, సోదరి ఇటీవల కమలాపూర్ మండలం గూడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఉన్నారు. దీంతో జహిరాబీ వారి బాగోగులు చూస్తూ పాఠశాలకు దూరమైంది. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయురాలు పద్మ, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు బాధిత కుటుంబీలకు రూ.5,555ల నగదు అందజేసి మానవత్వం చాటుకున్నారు.

చదువుపై దృష్టిసారించాలి

కాజీపేట : విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సెల్‌ఫోన్లతో గడపకుండా చదువుపై దృష్టి సారించాలని సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ సూచించారు. కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సంస్కార వికాస శిక్షణ సదస్సును నిర్వహించగా ఆయన మాట్లాడారు. సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్, కొండబత్తిన రాజేందర్, మార్క రవీందర్, గంగారపు యాదగిరి, మూల ఐలయ్య, సునీత, విద్యావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పలు సమస్యలను పరిష్కరించాలని, పార్ట్‌టైం లెక్చరర్ల నియమకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు బుధవారం వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్‌డీఎల్‌సీఈలో కౌన్సిలర్లను నియమించాలన్నారు. ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని ఓఎస్‌డీ పదవినుంచి తొలగించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కె.సుమన్, కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, జిల్లా కోఆర్డినేటర్ అరూరి రంజిత్, ఎంఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపల్లి మధు, కేయూ డాక్టరేట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మద్దిరాల మోహన్‌రెడ్డి, కుర్సా బాధ్యులు సోమరాజు, విష్ణు, పరిశోధక విద్యార్థులు కేతపాక ప్రసాద్, కందికొండ తిరుపతి పాల్గొన్నారు.

కాలనీలో సౌకర్యాలు కరువు

సుర్జీత్‌నగర్‌కాలనీలో సమస్యల తిష్ట
- సీసీ రోడ్లు, డ్రెయిజీలు లేక స్థానికుల ఇబ్బందులు

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం న్యూశాయంపేటలోని సుర్జీత్‌నగర్‌కాలనీలో స్థానికులు సమస్యలతో సతమతమవుతున్నారు. దీంతో కాలనీవాసులు అసౌకర్యాల నడుమ దుర్భరజీవితం కొనసాగిస్తున్నారు. 20ఏళ్ల క్రితం ప్రభుత్వ భూమిలో నిరుపేదలు నిర్మించుకున్న గుడిసెల్లో సుమారు 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. కాగా అనేక పోరాటాలతో 2015లో 300 మందికి, 2024లో 58 జీఓ ప్రకారం 300 మందికి పట్టాలిచ్చారు. అయితే కాలనీలో కనీస వసతులు కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తుండడంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీలు కరువు

సుర్జీత్‌నగర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటులో అధికారులు అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. దీంతో మురుగునీరు ఇళ్లలోకి పారుతూ దుర్వాసనతో అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇళ్ల మధ్యలో పారుతున్న, మురుగునీరు

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి..



సుర్జీత్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న 500 కుటుంబాల్లో 300 మందికి పట్టాలిచ్చారు. మిగతా 200 కుటుంబీకులకు సైతం పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. సొంత భూమిలేక 20ఏండ్లుగా కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదలను ఆదుకోవాలి.

\- కారు ఉపేందర్, సుర్జీత్‌నగర్ కాలనీ వ్యవస్థాపకుడు

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి



కాలనీ నుంచి బయట అడుగుపెట్టాలంటే ఇబ్బందిగా ఉంది, వెంటనే అధికారుల స్పందించి సీసీ రోడ్లు,సైడ్ డ్రెయినేజీల నిర్మాణం చేపట్టి అనారోగ్యాల బారిన పడకుండా కాపాడాలి. వర్షాకాలంలో సరైన రోడ్లు లేక బురదలో ప్రయాణం చేయడం ఇబ్బందిగా ఉంది. మురుగు నీటి దుర్వాసనతో దోమలు స్వైరవిహారం చేస్తు జ్వరాలబారిన పడుతున్నాం.

\- రజిత, సుర్జీత్‌నగర్ కాలనీ

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలి

- సమీక్ష సమావేశంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : ఆస్తి, నీటిపన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదని, పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. పన్ను వసూళ్లపై బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆర్ఐల వారీగా సమీక్షించారు. ప్రతీ బిల్‌కలెక్టర్ రోజు 100 రెసిడెన్షియల్‌లతోపాటు 20 కమర్షియల్ వసూళ్లు జరపాలని ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది వద్ద వసూళ్ల సంబంధిత అసెస్మెంట్ జాబితా, పెద్ద మొత్తంలో టాక్స్ చెల్లించాల్సిన వంద మంది జాబితా, 200 మంది డిఫాల్టర్ల జాబితాలు అందుబాటులో ఉంచుకొని వసూలు చేయాల్సిందేనన్నారు. ప్రాపర్టీ టాక్స్ వసూళ్ల లక్ష్యం రూ.11,731.84 లక్షలు కాగా, ఇప్పటివరకు రూ.5,030.29 లక్షలు (42.88శాతం) అధిగమించాచారని, నల్లా పన్ను లక్ష్యం రూ.6687.7 లక్షలు కాగా రూ.1207.38 లక్షలు (18.05శాతం) వసూళ్లు జరిగినట్లు అధికారులు తెలిపారు. మార్చి 31లోగా రూ.121.91కోట్లు వసూలు చేయాలని గుర్తు చేశారు. అదనపు కమిషనర్ జోనా,డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్‌ఓలు యూసుపొద్దీన్, శ్రీనివాస్, షహజాదిబేగం, ఐటీ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచండి

పార్కుల పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఉద్యానవన విభాగ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. నగర వ్యాప్తంగా 38 పార్కులలో పునరుద్ధరణ పనులు చేపట్టడానికి ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. ఏదైనా ఒక పార్క్‌ను ప్రయోగాత్మకంగా ఎంచుకొని డ్రిప్ ద్వారా నీటిని పిచికారీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ అధికారులు రమేష్ ,లక్ష్మారెడ్డి, అసిస్టెంట్‌లు ప్రిన్సి, ప్రవల్లిక, ప్రియాంక, అనూహ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు అనుకూలంగా బడ్జెట్



వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

హన్మకొండ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలంగా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వివక్ష చూపడంపై బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల నాయకులు చేతికి సంకెళ్లతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. ఏపీ పునర్విభజన చట్టం అమలును బీజేపీ నిర్లక్ష్యం చేసిందని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించలేదన్నారు. లక్షలాదిమంది యువకులకు ఉపాధి కల్పించే బయ్యారం ఉక్కు పరిశ్రమ ప్రాజెక్టును మూలకు పడేయడం దారుణమన్నారు.బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను ఆహ్వానించడం ద్వారా దేశీయ ఎల్‌ఐసీ, జీఐసీలపై ప్రభావం చూపనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఎస్.జ్యోతి, సదాలక్ష్మి, కె.శివాజీ, ఎస్.వాసుదేవ రెడ్డి, ఎ ం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, మద్దెల ఎల్లేష్, ఉ ట్కూరి రాములు, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, రాసమల్ల దీనా, బత్తిని సదానందం, మా లోతు శంకర్ నాయక్, సుదర్శన్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, రొంటాల రమేష్, దేవా, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, నిమ్మల మనోహర్, వీరన్న నాయక్, జి.రాములు, సాంబయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో..

వరంగల్ చౌరస్తా : కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని కమ్యూనిస్టు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. 10 కమ్యూనిస్టు, విప్లవ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా చేశారు. దీంతో అరగంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా నాయకులు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యూడెమొక్రసీ నేత రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, పలు పార్టీల నాయకులు గంగుల దయాకర్, అక్కెనపల్లి యాదగిరి, సుంచు జగదీశ్వర్, సత్యనారాయణ, ఎండీ బషీర్, ఆడెపు సదయ్య, పనాస ప్రసాద్, ఐతం నగేశ్, టి.భవాని, దుర్గయ్య, ఇనుముల శ్రీనివాస్, రంజిత్, గన్నారపు రమేశ్, గంధ్రతి హరిబాబు, ప్రశాంత్, మాలి ప్రభాకర్, దేశెట్టి సమ్మయ్య, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి


వరంగల్ : నగరంలోని వెంకట్రామా జంక్షన్ నుంచి లేబర్ కాలనీ వరకు వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ కోరారు. ఈమేరకు బుధవారం మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లేబర్ కాలనీ నుంచి వెంకట్రామా జంక్షన్ వరకు ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈవిషయంపై స్పందించిన మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రకాశ్ తెలిపారు.

రవీందర్‌రావును కలిసిన పీఏసీఎస్ చైర్మన్లు

వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల పదవీ కాలం ఆరునెలలు పొడిగించిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ (టీజీసీఏబీ) చైర్మన్ మార్నేని రవీందర్‌రావును బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పీఏసీఎస్ చైర్మన్లు కలిసి పూలబొకేలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. కాజీపేట దర్గా, వరంగల్, పర్వతగిరి, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్‌ల చైర్మన్లు ఉకంటి వనం రెడ్డి, ఇట్యాల హరికృష్ణ, మనోజ్‌గౌడ్, జక్కు రమేష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

డిక్షనరీల పంపిణీ

ఖిలా వరంగల్ : కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మీ నేస్తం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఆంగ్ల డిక్షనరీలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు జయప్రకాశ్, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు యాకోబు, ఉపాధ్యాయులు భిక్షపతి, ప్రసాద్, భాగ్యలక్ష్మి, ఉమాకుమారి, సంధ్యారాణి, సుకన్య, రేఖ పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ నాయకుల నిరసన

కేయూ క్యాంపస్ : అమెరికాలోని భారతీయ వలసదారులను అక్రమంగా బంధించి వెనక్కి పంపుతున్న ఆ దేశాధ్యక్షుడి చర్యలను, అలాగే మోదీ నిర్లక్ష్యాన్ని నిరసిస్తు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం కేయూ మొదటి గేట్‌వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు మాట్లాడుతూ అగ్రరాజ్యమైన అమెరికా తన నూతన ఆర్థికవిధానాలు ఇతర దేశాలపై బలవంతంగా రుద్దారని దీంతో వివిధ దేశాల్లో వలసలు పెరిగాయన్నారు. విద్యా, ఉపాధి కోసం అమెరికాకు వెళ్లిన వారి మనుగడ అధ్యక్షుడి చర్యలతో జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. అక్రమ వలసదారులంటూ భారతీయులపై అమెరికా అధ్యక్షుడి చర్యలను మోదీ ప్రభుత్వం పట్టించుకోకపోవటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కావ్య, అనూష, కన్వీనర్ బాలు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

మైనారిటీ గురుకులంలో 'తఖ్‌మీల్ ఏ ఖురాన్'

న్యూశాయంపేట : కేయూ క్రాస్‌రోడ్‌లోని వరంగల్–1, మైనార్టీ గురుకులంలో బుధవారం తఖ్‌మీల్ ఏ ఖురాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుకులంలో విద్యానభ్యసిస్తున్న 34 మంది మైనార్టీ వి ద్యార్థులు ఖురాన్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి ప్రిన్సిపాల్ డి.కృష్ణకుమారి శాలువాలతో స న్మానించిసర్టిఫికెట్స్ అందజేశారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్

వరంగల్ : వరంగల్ ఎల్‌బీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు అతిథులుగా హాజరు కాగా వారికి సన్మానం నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ బండారి కిరణ్ మాట్లాడుతూ..జీవితంలో ఎటువంటి పరిస్థితుల్లోనూ తల్లిదండ్రులను దూరం చేయొద్దని అన్నారు. చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి, కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, డీన్ వెంకటేశ్, జనార్దన్, శ్వేత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చెన్నకేశవస్వామి కల్యాణం

మడికొండ : కాజీపేట మండలంలోని మడికొండలో గల శ్రీ శివకేశవ ఆలయంలో బుధవారం వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం జరిపించారు. ఉదయం నుంచి అర్చకులు వంశీకృష్ణచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వైభవంగా శ్రీదేవి, భూదేవి, శ్రీలక్ష్మి సమేత శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణతంతును చేపట్టారు. తొటిరెడ్డి విద్యాసాగర్‌రెడ్డి, దొంతుల శంకర్ లింగం,ఆలయ కమిటీ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, పింగిళి రఘునాథరావు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

బాలల రక్షణలో పేరెంట్స్‌దే కీలకపాత్ర

- అడిషనల్ డీసీపీ ఎన్.రవి

హన్మకొండ: బాలలను ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని వరంగల్ పోలీసు కమిషనరేట్ అడిషనల్ డీసీపీ ఎన్.రవి అన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని 'అసుంత' భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో వరంగల్, హనుమకొండ జిల్లాలోని ఎంపిక చేసిన తల్లిదండ్రులకు 'ఆన్‌లైన్‌లో బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు–దానిని నిరోధించడంలో తల్లిదండ్రుల పాత్ర' అనే అంశంపై వర్క్‌షాపు జరిగింది. అడిషనల్ డీసీపీ ఎన్.రవి మాట్లాడుతూ మారుతున్న సమాజంలో ప్రతీ ఒక్కరికి ఇంటర్‌నెట్ జీవన విధానంలో భాగమైందని, వినియోగంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల కౌమార బాలలు దీని బారిన పడుతున్నారన్నారు. బాలలను వేధింపులకు గురి చేస్తే 1930, 100, 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న, మై చాయిస్ ఫౌండేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ జె.క్రాంతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యురాలు డాక్టర్ కరుకాల అనితారెడ్డి, హనుమకొండ జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికి సుధాకర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఎస్.భాస్కర్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీకాంత్, మేనేజర్ అజయ్ కుమార్, ఫీల్డ్ కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ఎన్.రవి

ఆధునిక సాగుపై అవగాహన ఉండాలి

ఖిలా వరంగల్ : ఆధునిక వ్యవసాయ సాగు విధానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, శాస్త్రవేత్త సౌమ్య సూచించారు. ఈమేరకు బుధవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. ఈసందర్భంగా నూతన సాగువిధానం, పంటలను విద్యార్థులు పరిశీలించారు. అనంతరం చేపలు, నాటు కోళ్ల పెంపకం వల్ల వచ్చే లాభాలను వివరించారు. ఎస్ఆర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయి కృష్ణారెడ్డి, శ్రీను, శ్రావ్య, పూజ, శ్రీవాత్సవ్, మానస, అమిత్, రవితేజ పాల్గొన్నారు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సౌమ్య

'బీసీ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించండి'

వరంగల్ : వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీసీ నాయీబ్రాహ్మణ(ఎంబీసీ) సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ కొలిపాక వెంకటస్వామికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ కోరారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాశిబుగ్గ 19వ డివిజన్‌లో రాష్ట్ర కార్యదర్శి గోగికార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు బి.రామ్మోహన్, డి.శేఖర్, బేతి రాజు, బ్రహ్మచారి, రవి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రచారం'

హసన్‌పర్తి : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బలపరిచిన పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని బీజేపీ నాయకులు మండల కేంద్రంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాంచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతి, చకిలం రాజేశ్వర్‌రావు, మట్టెడ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్.. ఇప్పించండి



కొరవి గణేష్

కాజీపేట : కాజీపేటలోని డీజిల్‌కాలనీకి చెందిన కొరవి గణేష్‌కు ఐదేళ్ల క్రితం పక్షవాతం రావడంతో దాతల సాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ప్రస్తుతం బంధువుల ఇంట్లో తల దాచుకుంటున్నాడు. అయితే గణేష్ పక్షవాతానికి గురికావడంతో సరిగ్గా నడవలేని పరిస్థితి ఏర్పడింది. మిత్రుల సహకారంతో ఎంజీఎం ఆస్పత్రి నుంచి సదరం ధ్రువీకరణ పత్రం తెచ్చుకున్నాడు. తనకు పింఛన్ మంజూరు చేయాలని రెండేళ్లుగా ఎదురు చూస్తున్నట్లు గణేష్ కన్నీటి పర్యంతమవుతున్నాడు. దీన స్థితిలో ఉన్న గణేష్‌ను కుటుంబీకులు భారంగా భావిస్తుండటంతో మనసులోని బాధను ఎవరితో చెప్పుకోలేక కుమిలి పోతున్నాడు. ఇప్పటికైన నా పింఛన్ అందించి ఆదుకోవాలని గణేష్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. కలెక్టర్ స్పందించి పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

వినియోగదారుల హక్కుల రక్షణే ధ్యేయం

ఖిలా వరంగల్ : వినియోగదారుల హక్కుల రక్షణే ధ్యేయమని వినియోగదారుల జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. ఈమేరకు బుధవారం శివనగర్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 15లోపు 33 జిల్లాలో నూతన కమిటీలను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం జిల్లా, మండల కమిటీలను ఆయన ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గన్నోజు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆరెబెల్లి సందీప్, సిటీ అధ్యక్షుడిగా మురహరి కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా బేతి రాజేష్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడిగా దుగ్యాల తరుణ్, కార్యదర్శిగా బత్తిని అనిల్‌కుమార్, హనుమకొండ మండల అధ్యక్షుడిగా గంగరాజు, సతీష్, ప్రధాన కార్యదర్శిగా రామోజు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డీజిల్ షెడ్‌లో రైల్వే హెల్త్ క్యాంప్



కాజీపేట రూరల్: పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో బుధవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. రైల్వే ఆస్పత్రి డీఎంఓ డాక్టర్ ధీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంపులో డాక్టర్లు నరేందర్‌హిర్వాని, ఉత్తమ్, ప్రవళిక, వైద్య సిబ్బంది 180 మంది రైల్వే ఎంప్లాయిస్‌కు పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. నేడు(గురువారం) కూడా కార్మికుల కోసం హెల్త్ చెకప్ క్యాంపును నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ చైర్మన్ ఎస్‌కె. జానిమియా, ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, శివప్రసాద్, మాషజాని, రాజయ్య, శ్రీధర్, రైల్వే వైద్య సిబ్బంది కవిత, రమాదేవి, ప్రసాద్, మల్లేష్, గోపి, కార్మికులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి అపూర్వ స్పందన

ఖిలా వరంగల్ : వరంగల్ 32వ డివిజన్ బీఆర్ నగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ పద్మాక్షి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి, డాక్టర్ సిరికొండ భాస్కర్‌రావు, ధరణికోటి వీణావాణి హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వైద్యులు ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ

సాక్షి నెట్‌వర్క్: ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం అన్నారు. పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ, ఏబీవీపీ, ఆరె సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఖిలా వరంగల్: శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆరె సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్



హనుమకొండ బీఆర్‌ఎస్ కార్యాలయంలో రజనీకాంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు



కేయూ క్యాంపస్: శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు